చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వంగ మధుసూదన్‌రెడ్డి, సామ రమణారెడ్డి

చంపాపేట: వేసవిలో పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయమని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేటకు చెందిన బైగళ్ళ రవీందర్ తన తల్లి తండ్రి బాలయ్య, పొన్నమ్మ జ్ఞాపకార్థం చంపాపేట చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో రవీందర్ సోదరులు అశోక్, జగదీశ్వర్, నర్సింహ, నాయకులు యాదగిరి, ఈశ్వర్, శ్రీశైలం, ఆనంద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయండి

మలక్‌పేట: యూజీసీ నూతన నిబంధన ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని ఈనెల 27న పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఓయూలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల అధ్యక్షుడు మందుల సైదులు అన్నారు. బుధవారం మూసారంబాగ్ బీసీ ఉమెన్స్ హాస్టల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారన్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు సదస్సుకు తరలిరావాలని కోరారు. సమావేశంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు గణేష్, సహాయ కార్యదర్శి వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత నేరస్తుల పనే

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

రూ. 15లక్షల సొత్తు స్వాధీనం



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తుతో సైదాబాద్ పోలీసులు

సైదాబాద్: ఇంటి తాలం పగులకొట్టి చోరీకి పాల్పడిన కేసులో నిందింతులను సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. షహీన్‌నగర్‌కు చెందిన హబీబ్ మహమ్మద్ అలియాస్ చోటూ (37) ప్లంబర్‌గా పని చేసేవాడు. అతడి సోదరుడు హబీబ్ అలీ అలియాస్ అలీ (19) కూలీగా చేసేవాడు. ఇద్దరూ కలిసి తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడే వారు. హబీబ్ మహమ్మద్‌పై 59, హబీబ్ అలీ కూడా 8 కేసులు ఉన్నాయి. వారిద్దరూ 2024 జులైలో మొఘల్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసులో అరెస్టై జైలుకు వెళ్లారు. 2025 ఫిబ్రవరిలో బెయిల్‌పై బయటికి వచ్చిన వారు మళ్లీ చోరీల బాట పట్టారు. ఈ నెల 23న సైదాబాద్ లోకాయుక్త కాలనీకి చెందిన అఫ్రా ఫాతిమా కుటుంబం బంధువుల ఇంటికి వెళ్లింది. దీనిని అదనుగా తీసుకున్న హబీబ్ మహమ్మద్ తాళం పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించి బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు చోరీ చేశాడు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన సైదాబాద్ పోలీసులు సాంకేతిక ఆధారాలతో హబీబ్‌ను నిందితుడిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. చోరీ సొత్తులో సగభాగాన్ని అమ్మేందుకు సోదరుడు హబీబ్ అలీకి ఇచ్చానని చెప్పడంతో అతడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 15లక్షల విలువ చేసే 145 గ్రాముల బంగారు ఆభరణాలు, బైక్, రెండు సెల్‌ఫోన్లు, వాచ్, దొంగతనానికి ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

గాలికొదిలేశారు..!

- నాగోలు డివిజన్‌లో అభివృద్ధికి నోచుకోని పార్కులు
- చెత్తాచెదారంతో నిండిపోయిన వైనం
- ఇతర ప్రాంతాల్లోని పార్కులకు వెళ్తున్న వాకర్స్
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

నాగోలు: నాగోల్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల పార్కులు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు ఉదయం, సాయంత్రం సమయాల్లో పార్కుల్లో వాకింగ్, యోగా చేయలేని పరిస్థితి నెలకొంది. కాలనీల్లో పార్కు స్థలాలు ఉన్నా వాటిని అభివృద్ధి చేయడంలో జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పార్కులు అందుబాటులో లేక ఇతర కాలనీలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు..

నాగోలు డివిజన్ పరిధిలోని అరుణోదయకాలనీ,



చెత్తతో నిండిపోయిన బండ్లగూడ విజయా గార్డెన్ పార్క్

విజయాగార్డెన్ పార్క్, కృషినగర్ పార్క్, సాయినగర్, లలితానగర్ పార్క్, లక్ష్మీనరసింహ కాలనీ పార్క్, మమతనగర్ కాలనీ, జైపురికాలనీ, శ్రీనివాస్‌కాలనీతో ఇతర ప్రాంతాల నుంచి పార్కుల నిర్వహణ అధ్వానంగా మారిందని ఆయా కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా నాగోల్ డివిజన్ పరిధిలో పార్కులను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



అభివృద్ధికి నోచుకోని బండ్లగూడ కృషినగర్ పార్క్



మమతానగర్ కాలనీలో పార్క్ ఎదుట పేరుకుపోయిన చెత్త



నాగోలు మమతానగర్ కాలనీ పార్క్ దుస్థితి ఇదీ

పార్కుల్లో ఆట వస్తువులు, టాయిలెట్లు, గార్డెనింగ్ తదితర వసతులు కల్పించాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

వివిధ కాలనీలో ఏర్పాటు చేసిన పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయాయని కాలనీల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారుల నిఘా లోపం, నిర్లక్ష్యం కారణంగా కొందరు యువకులు రాత్రి వేళల్లో పార్కుల్లో మద్యం, గంజాయి సేవిస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కులను అభివృద్ధి చేసి అందుబాటులో తీసుకురావాలని కోరుతున్నారు.

అధికారులు శ్రద్ధ చూపాలి..



నాగోలు పరిధిలోని వివిధ కాలనీలలో ఏర్పాటు చేసిన పార్కులను అభివృద్ధి చేసి అందుబాటులో తీసుకురావాలి. నాగోలు పరిధిలో పెద్ద పార్కులు అందుబాటులో లేకపోవడంతో కాలనీ వాసులు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. అధికారులు స్పందించి డివిజన్ పరిధిలో పార్కులను అభివృద్ధి చేయాలి.

– వేముగంటి సంపత్, నాగోలు

ధర్మభిక్షం సేవలు ఎనలేనివి



ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

మన్సూరాబాద్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం పేదల కోసం చేసిన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు అన్నారు. ధర్మభిక్షం 14వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం సీపీఐ హయత్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఎల్‌బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో నాయకులు రమావత్ శక్రునాయక్, మందుల కృష్ణ, అలివేణి, శేషరాజుపల్లి శ్రీదేవి, శివజ్యోతి, సరిత, సౌజన్య, రాములు, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సీపీఐ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో..

నాగోలు: సీపీఐ అనుబంధ సంఘాల కార్యాలయం ఎస్ఏ డాంగే భవన్ బుధవారం తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం 14వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల రాష్ట్ర సబ్‌కమిటీ సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ విముక్తి కోసం చేసిన పోరాటం ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, ప్రదీప్ కుమార్, రవికుమార్, ఆమని, అఖిల, నాగభూషణం, ఈశ్వర్, బి.రాములు, సైదారావు, జగన్, గోపాల్, ఉషారాణి పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటుతాం

చంచల్‌గూడ: జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 100 సీట్లు సాధించే దిశగా బీజేపీ దృష్టి సారించిందని పార్టీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు జంగ్లి నిరంజన్‌యాదవ్ అన్నారు. బుధవారం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీకి చారిత్రాత్మక విజయాన్ని అందించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన అమలుకాని ఆరు గ్యారంటీలతో ప్రజలు మోసపోయారన్నారు. ప్రజలు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను నమ్మడం లేదని వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించి మేయర్ పీఠాన్ని దక్కించుకుంటామన్నారు. త్రిపుల్ తలాక్‌పై నిషేధంతో మైనార్టీలు కూడా బీజేపీకి మద్దతు పలుకుతున్నారన్నారు. హిందూ, ముస్లింల మధ్య విద్వేశాలు సృష్టిస్తూ ఎంఐఎం పబ్బం గడుపుతుందన్నారు. త్వరలో పూర్తి స్థాయిలో జిల్లా, డివిజన్ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్, యాఖుత్‌పురా కన్వీనగర్ బండ వెంకట్ రెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పాగా రాజేష్, నాయకులు శ్రీనాథ్, యుగేందర్, నాగరాజు, ఈశ్వర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిరంజన్‌యాదవ్

హత్య కేసులో నిందితుల అరెస్ట్

నాగోలు: ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివ గంగ కాలనీలో శనివారం రాత్రి పాత కక్షల నేపథ్యంలో బొడ్డు మహేష్ అనే యువకుడిని దారుణంగా హత్య చేసిన కేసులో ఆరుగురు నిందితులను ఎల్‌బీనగర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి కారు, గొడ్డలి, కొడవళ్లు 5 సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.. ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. భరత్‌నగర్‌లో నివాసం ఉండే బొడ్డు మహేష్ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన పగిళ్ల పురుషోత్తం స్నేహితులు. 2023 మార్చిలో ఓ పెళ్లి ఊరేగింపులో పురుషోత్తం బీర్ బాటిల్‌తో మహేష్‌పై దాడి చేశాడు. ఈ సంఘటనలో తలకు గాయాలు కావడంతో మహేష్ హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ కేసు విషయంలో రాజీ పడేందుకు మహేష్ గత డిసెంబర్ 20న హయత్‌నగర్ కోర్టుకు రావాల్సి ఉంది. అయితే అతను కోర్టు రాకుండా తాను సూర్యాపేటలో ఉన్నానంటూ కోర్టు కానిస్టేబుల్‌కు చెప్పి పురుషోత్తంను హత్య చేసేందుకు ప్లాన్ చేశాడు. అదే రోజు మహేష్ తన సహచరులతో కలిసి పురుషోత్తం, రాము తదితరులపై కత్తులతో దాడి చేశారు. ఈ సంఘటనలో పురుషోత్తం తప్పించుకోగా రాము, నాగరాజు గాయాలయ్యాయి. పోలీసులు మహేష్, అతని అనుచరులపై హత్యాయత్నం కేసు నమోదు చేయడంతో జైలుకు వెళ్లారు. ఇటీవల మహేష్ అతడి స్నేహితులు జైలు నుంచి బెయిల్‌పై బయటికి వచ్చారు. అతడిపై పగ పెంచుకున్న పురుషోత్తం మహేష్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. శనివారం రాత్రి బైక్‌పై వెళ్తున్న మహేష్‌ను రాము కారుతో ఢీ కొట్టగా కింద పడిన అతడిపై పురుషోత్తం, నాగార్జున, సందీప్ గొడ్డళ్లు, కొడవళ్లతో దాడి చేసి హత్య చేశారు. మహేష్ సోదరి మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన ఎల్‌బీనగర్ పోలీసులు నిందితులు పగిళ్ల పురుషోత్తం, నోముల నాగార్జున, మంద సందీప్, గడమోని రాము, రాజా రాకేష్, కుంచాల ఓంకార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



పోలీసుల అదుపులో నిందితులు

మందు బాబులకు అడ్డుకట్ట వేయండి

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని కమలానగర్ కాలనీలో ఇబ్బందికరంగా మారిన సాయి సూర్య వైన్స్‌పై తగిన చర్యలు తీసుకోవాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అధికారులను కోరారు. బుధవారం కాలనీవాసుల ఫిర్యాదు మేరకు ఆయన కమలానగర్ కాలనీ సమీపంలోని వైన్స్ షాప్ పరిసరాలను పరిశీలించారు. వైన్స్ ప్రధాన రోడ్డులో ఉన్నా మరో వైపు కాలనీలోకి మరో గేటును ఏర్పాటు చేయడం వల్ల తాగుబోతులు కాలనీలోకి ప్రవేశిస్తూ రాత్రివేళ న్యూసెన్స్ చేస్తున్నారని కాలనీవాసులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి, టీ.వీ. రావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనా గానం



నాగోలు: తాళ్లపాక అన్నమాచార్య వర్ధంతి సందర్భంగా బుధవారం కొత్తపేట మోహన్‌నగర్‌లో శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమీ, హరిహరా క్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నమన్య సంకీర్తనా గానం అలరించింది. అన్నమాచార్యకు స్వరనివాళి అర్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు అకాడమీ డైరెక్టర్ వసుధమూర్తి తెలిపారు.

నవోదయ ఫలితాల్లో రేయాన్ విద్యార్థుల ప్రతిభ..



నవోదయలో సీట్లు సాధించిన విద్యార్థులు..

నాగోలు: దేశ వ్యాప్తంగా నిర్వహించిన నవోదయ స్కూల్ 6 వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో నాగోలు బండ్లగూడలోని రేయాన్ నవోదయ స్కూల్‌కు చెందిన 42 మంది విద్యార్థులు నవోదయకు ఎంపికైనట్లు రేయాన్ నవోదయ స్కూల్ డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం నాగోలులోని రేయాన్ సైనిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీట్లు సాధించిన విద్యార్థులను సన్మానించారు. రేయాన్ డైరెక్టర్ ఉమారెడ్డి మాట్లాడుతూ 25 ఏళ్లుగా వందలాది మంది విద్యార్థులు నవోదయతో పాటు, సైనిక్, ఆర్ఎంఎస్ స్కూళ్లకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉండటం తమకు గర్వంగా ఉందన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులకు కేటాయించాలి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్‌లో ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే అర్హులకు కేటాయించాలని సీపీఎం నేతలు అన్నారు. ఈ మేరకు బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా పేదల ఇళ్ల సమస్య పరిష్కరించలేదన్నారు. గత ప్రభుత్వం ఇళ్లు లేని పేద వారికి ఇళ్లు కేటాయిస్తామని చెప్పడంతో ఎంతో మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. పలు ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తయినా వాటిని ఎవరికీ కేటాయించకపోవడంతో నిరుపయోగంగా మారాయన్నారు. వెంటనే అధికారులు అర్హులను గుర్తించి వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎల్లయ్య, రామస్వామి, కాశయ్య, రాధమ్మ, వెంకన్న, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం

మన్సూరాబాద్: విజయశ్రీకాలనీలోని శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి వేంకటేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి దంపతులతో ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఉదయం శ్రీ హయగ్రీవ హోమం, రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చీర్క నర్సిరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జోన్నాడ మోహన్‌రెడ్డి, కార్యదర్శి మార్గం రాజేష్, సత్యనారాయణ, శ్యాంసుందర్‌రెడ్డి, రమణారెడ్డి, లోకేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



రమావత్ శివ (ఫైల్)

సైదాబాద్: ఓ యువకుడు సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సింగరేణి కాలనీకి చెందిన రమావత్ శివ (28) కూలీగా పని చేస్తూ జీవనం సాగించేవాడు. మద్యానికి అలవాటు పడిన అతను బుధవారం ఉదయం మద్యం తాగి ఇంటికి వచ్చి గదిలోకి వెళ్లి డియ పెట్టుకున్నాడు. దీనిని గుర్తించిన అతడి భార్య రాణి తలుపు కొట్టినా స్పందించకపోవడంతో స్థానికుల సహాయంతో గది తలుపులు పగులకొట్టి చూడగా శివ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న సైదాబాద్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కుటుంబ కలహాల కారణంగానే అతను ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

